క్లుప్తంగా

నియోజకవర్గం ప్రగతిపై ఎమ్మెల్యే, బీద చర్చలు


దామవరంలోని బీఎంఆర్ ఇండస్ట్రీస్‌లో బీద మస్తాన్‌రావుతో రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు నియోజకవర్గంలోని పలు అంశాలపై మంగళవారం చర్చించారు. దామవరంలోని బీఎంఆర్ ఇండస్ట్రీస్‌కి సంబంధించిన కార్యాలయంలో బీద మస్తాన్‌రావుని కలిసి నియోజకవర్గ ప్రగతి, పారిశ్రామిక అభివృద్ధి తదితర అంశాలతో పాటు పలు ఇతర అంశాలను చర్చించారు. ఎమ్మెల్యే వెంట దగదర్తి ఎంపీపీ తాళ్లూరి ప్రసాద్‌నాయుడు, పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు ఉన్నారు.

భూముల రీసర్వే సకాలంలో పూర్తి చేయాలి


తహసీల్దారు కార్యాలయంలో భూముల రీసర్వేపై అధికారులతో సమీక్షిస్తున్న ఆర్డీఓ మధులత

ఆత్మకూరురూరల్: వైఎస్సార్ జగనన్న భూ హక్కు, భూరక్ష పథకంలో నిర్వహిస్తున్న భూముల రీసర్వే ప్రక్రియను సకాలంలో పకడ్బందీగా నిర్వహించాలని ఆత్మకూరు ఆర్డీఓ కురుబా మధులత అన్నారు. ఆత్మకూరు తహసీల్దారు కార్యాలయంలో మంగళవారం రెవెన్యూ అధికారులు, వీఆర్‌ఓలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రస్తుతం రీ సర్వే జరుగుతున్న గ్రామాల్లో పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ రీసర్వే డీటీ సుజిత, డిప్యూటీ తహసీల్దారు రాజేష్, ఆర్‌ఐ విజయ్‌కుమార్, వీఆర్‌ఓలు పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ


లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: కావలి నియోజకవర్గంలోని 17 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి అందిన రూ.24 లక్షల చెక్కులను ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి మంగళవారం లబ్ధిదారులకు పంపిణీ చేశారు. లబ్ధిదారులకు సీఎం సహాయనిధికి దరఖాస్తు చేసుకున్న వెంటనే త్వరితగతిన సాయం అందడంపై లబ్ధిదారులకు ఎమ్మెల్యేకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ సన్నిబోయిన ప్రసాద్ యాదవ్, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు పందిటి కామరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

102 మందికి కంటి పొర చికిత్స

ఆత్మకూరురూరల్: మండలంలోని మహిమలూరులో చెన్నైకు చెందిన శంకర నేత్రాలయ ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత కంటి పొర చికిత్సా శిబిరంలో 438 మందికి పరీక్షలు నిర్వహించారు. వీరిలో 102 మందికి కంటి పొర చికిత్స అవసరమని నిర్ధయించామని శంకర నేత్రాలయ వైద్యాధికారి అరుణ్ కుమార్ తెలిపారు. నవంబరు 4వ తేదీ వరకు శిబిరం నిర్వహిస్తామన్నారు.

మంచినీటి బోరు నిర్మాణానికి భూమి పూజ

చేజర్ల: చేజర్ల పంచాయతీ దక్షిణపు వీధిలో మంచినీటి బోరు ఏర్పాటు చేస్తున్నామని ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. గతంలో ఏర్పాటు చేసిన బోరు మరమ్మతులకు గురైందన్నారు. తాజాగా బోరు పాయింట్‌కు భూమి పూజ చేశారు. రెండు రోజుల్లో ఇక్కడి ప్రజలకు తాగునీరు అందిస్తామని తెలిపారు. చేజర్ల చెరువు కింద పొలాలకు సాగు నీరందించే దేవుడు మాన్యం కాలువ, శివాలయం కాలువలో పూడిక తీత పనులను ఎంపీపీ తూమాటి పరిశీలించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆవుల వెంకటేశ్వర్లు, ఉప సర్పంచ్ ఉడతా పుల్లయ్య యాదవ్, పాలకొండ రత్నారెడ్డి, రసూల్ పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ అవతరణ ఉత్సవాలకు ఆత్మకూరు వాసి


కిషోర్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: ఏక్‌భారత్, శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో భాగంగా నవంబరు 1న మిజోరం రాజ్‌భవన్‌లో దేశంలోని పలు రాష్ట్రాల అవతరణ దినోత్సవాలు నిర్వహించనుండగా, వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారిని ఆహ్వానించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి ఆత్మకూరు ఆంధ్ర ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆదూరి కిషోర్‌రెడ్డికి ఈ అవకాశం దక్కింది.

పేదల అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ ధ్యేయం

- సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి


సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి

ఉదయగిరి: పేదల అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. ఆయన మంగళవారం మండలంలోని వెంగళరావునగర్‌లో అధికారులు, నాయకులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. గ్రామస్తులు పలువురు సీసీ రోడ్లు నిర్మించాలని, తాగునీరు, విద్యుత్ సమస్యను తీర్చాలని, ఇంటి స్థలాలు మంజూరు చేయించాలని విన్నవించారు. సమస్యలు త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం రాజారెడ్డి మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి ప్రభుత్వం నవరత్నాల పథకాలు అమలు చేస్తూ ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరుస్తోందన్నారు. పార్టీలు, కులాలు, మతాలకతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. కరోనా సమయంలో ప్రజలకు అండగా నిలిచారన్నారు. ముఖ్యమంత్రి స్థానంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాకపోతే చాలా ఇబ్బందులు పడి ఉండే వాళ్లమన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాకుండా మరెవరైనా ఉండి ఉంటే పరిస్థితి ఏమిటో ఊహించుకుంటునే ఇప్పటికీ భయంగా ఉందని ఎంతో మంది నాతో చెబుతున్నప్పుడు కరోనా సమయంలో ప్రజలకు అందించిన సేవలు నిరుపమామన్నారు. పేదోళ్ల నుంచి మధ్య తరగతి ప్రజలు సైతం ఉపాధి, బతుకుదెరువు కోల్పోయితే.. సంక్షేమ పథకాల ద్వారా ఆదుకున్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు చేస్తున్నారన్నారు. తండ్రిని మించిన తనయుడిగా ప్రజారంజక పాలన అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. విద్య, వైద్యరంగాలకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. సచివాలయ, వలంటరీ వ్యవస్థలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ప్రజలు గత ప్రభుత్వ పాలనకు, ప్రస్తుత జగనన్న పాలనకు బేరీజు వేసుకోవాలన్నారు. ప్రతిపక్షాలు, ఇతర పార్టీల వారు చేసే విమర్శలు, ఆరోపణలను తిప్పికొట్టాలన్నారు. ప్రజలకు ఏం కావాలో, ఏం అందించాలో సీఎం జగన్‌కు మంచి అవగాహన ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా తనను మంచి మనస్సుతో ఆశీర్వదించి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ డి.ఈశ్వరమ్మ, తహసీల్దార్ ఎస్.శ్రీనివాసులురెడ్డి, కార్యదర్శి అమర్‌నాథ్‌రెడ్డి, సర్పంచ్ ఎం.తిరుపతయ్య, పార్టీ మండల అధ్యక్షుడు జి.ఓబుల్‌రెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు మూలె వినయ్‌రెడ్డి, మాజీ కన్వీనర్లు మూలె సుబ్బారెడ్డి, అక్కి భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు కె.అబ్దుల్, షేక్ మహ్మద్ ఖాజా, నాయకులు జి.శ్రీనివాసులురెడ్డి, రియాజ్, జి.వెంగళరెడ్డి, కాంట్రాక్టర్ మహ్మద్‌ఖాజా, తిరుమలాపురం సర్పంచ్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు వరం

- 29 కంపెనీల సహకారంతో రేపే జాబ్‌మేళా
- ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి సారథ్యంలో 2 వేల పైచిలుకు ఉద్యోగాల కల్పన


ఆత్మకూరు
మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్: ఉద్యోగాన్వేషణలో ఉన్న నిరుద్యోగ యువత కోసం ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో దివంగత పరిశ్రమల శాఖ మంత్రి మేకపాటి గౌతమ్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని నవంబర్ 2వ తేదీ జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఆత్మకూరు ఇంజినీరింగ్ కళాశాల కేంద్రంగా 29 కంపెనీల సహకారంతో 2 వేల పైచిలుకు ఉద్యోగాలు కల్పించేందుకు సంకల్పించిన ఈ ఉద్యోగ మేళా నిరుద్యోగులకు వరం కానుంది. ప్రముఖ కంపెనీలైన సెయింట్, సెంచరీ ఫ్లైబోర్డ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, బ్రిటానియా ఇండ్రస్టీస్, బ్రిగేడ్ ఎంటర్‌ప్రైజెస్, హ్యూమనిఫి. ఏఐ, ఇన్నోవ్‌సోర్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రభాస్ వీకేర్ హెల్త్ క్లినిక్ ప్రైవేట్ లిమిటెడ్, వీల్స్ ఇండియా లిమిటెడ్, అపోలో ఫార్మసీ, వరుణ్ మోటార్స్ ఫాక్స్ కాన్, ఇసూజు మోటార్స్, నిట్టాన్ ఇండియా, హంట్రెట్ డొగ్లస్, ఎస్ఎస్ ఇన్‌స్ట్రుమెంట్స్, అంబర్ ఇండ్రస్టీస్, ఆస్ట్రోటెక్ స్టీల్, సీతటీసీ, ట్ర్యూన్ టెక్నోఫాబ్, బ్లూఓషన్ పర్సనల్, ఫ్లిక్‌కార్డ్, సెర్వ్‌వే గ్లోబల్ ప్రైవేట్ లిమిటెడ్, ఎయిర్ టెల్ పేమెంట్స్ బ్యాంక్, రిలయన్స్ నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్, అమరరాజా బ్యాటరీస్ ఆటోసెన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, గ్రీన్ టెక్ ఇండ్రస్టీస్, నవతా రోడ్ ట్రాన్స్‌పోర్టు, పేటీఎం వంటి 29 కంపెనీల్లో 2 వేలకు పైగా ఉద్యోగావకాశాలు కల్పించనున్నాయి. జాబ్‌మేళాలో 10వ తరగతి నుంచి ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్, ఐటీఐ, డిప్లొమో, ఎంబీఏ ఫైనాన్స్, డిప్లొమో ఇన్ మెకానికల్, బీటెక్ మెకానికల్ వరకు విద్యాభ్యాసం చేసుకున్న నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. నిరుద్యోగ యువతీ యువకులు నవంబర్ 2వ తేదీ ఉదయం 9 గంటల నుంచి ఆత్మకూరు ఆంధ్రా ఇంజనీరింగ్ కళాశాలలో ఆయా కంపెనీలు నిర్వహించే జాబ్ ఇంటర్వ్యూలలో పాల్గొని ఉద్యోగ అవకాశాలు పొందాలని ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పిలుపునిచ్చారు. జాబ్‌మేళాకు హాజరయ్యే వారికి మధ్యాహ్న భోజన సదుపాయం కూడా కల్పించనున్నట్లు తెలిపారు.

ఇందిరా గాంధీకి ఘన నివాళి


రక్తదాన శిబిరంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు


ఇందిరమ్మ చిత్రపటానికి నివాళులు

ఆత్మకూరురూరల్: భారత తొలి మహిళా ప్రధాన మంత్రి, భారతరత్న ఇందిరా గాంధీ వర్ధంతి సందర్భంగా ఆత్మకూరులోని రాజీవ్‌భవన్‌లో కాంగ్రెస్ పార్టీ నాయకులు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. పీసీసీ ప్రధాన కార్యదర్శి, ఆత్మకూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చేవూరు శ్రీధర్ రెడ్డి నాయకత్వంలో 26 మంది యువకులు రక్తదానం చేశారు. జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వన్నం నాగరాజు మాట్లాడుతూ ఇందిరా గాంధీ అమలు చేసిన పలు సంస్కరణలు పేదలు అందరికి రక్షణ కవచంలా నిలిచాయన్నారు. కార్యక్రమంలో నాయకులు గంగపట్ల రామ్‌కి, పసల మస్తానయ్య, రసూల్, వేణు, నాయబ్, మహేంద్ర, ఆత్మకూరు బ్లడ్ బ్యాంకు ప్రతినిధి సాధిక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

వరికుంటపాడు: దివంగత ప్రధానమంత్రి ఇందిరాగాంధీ 39వ వర్ధంతిని మంగళవారం మండలంలోని యర్రంరెడ్డిపల్లెలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి దుద్దుకూరి రమేష్‌నాయుడు నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమానికి ఎన్నో పథకాలు ప్రవేశపెట్టారన్నారు. పేదలకు గూడు కల్పించిన ఘనత ఆమెదేనన్నారు. బ్యాంకుల జాతీయకరణ, పేదలకు భూపంపిణీ చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో షేక్ మునాఫ్, శ్రీను, ధోణిశేఖర్, కిషోర్, ప్రసాద్, దేవి తదితరులు పాల్గొన్నారు.

బహుజన రాజ్యాధికారమే ధ్యేయం


మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి

ఆత్మకూరురూరల్: బహుజనులు అంతా ఏకమై రాజ్యాధికారమే ధ్యేయంగా పని చేయాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి, రాష్ట్ర కో–ఆర్డినేటర్ గౌతమ్, జిల్లా అధ్యక్షురాలు పుష్పాంజలి పేర్కొన్నారు. పట్టణంలో మంగళవారం బీఎస్పీ ఆత్మకూరు నియోజకవర్గ అధ్యక్షుడు నందా ఓబులేసు ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో నుంచి ఎంజీఆర్ బస్టాండ్ వరకు బహుజన రాజ్యాంగ చైతన్య ర్యాలీ నిర్వహించారు. బహిరంగ సభలో వక్తలు మాట్లాడుతూ ఐకమత్యంతోనే రాజ్యాధికారం చేపట్టగలమన్నారు. బీఎస్పీ నాయకులు చెన్నుపల్లి రామకృష్ణ, ఆంద్రా కాంతారావు, దివానపు రజనీ, ధర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల ముసాయిదాపై ఆర్వో సమీక్ష


అధికారులతో సమీక్షిస్తున్న ఆర్వో రాజారమేష్ ప్రేమ్‌కుమార్

ఉదయగిరి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ల ముసాయిదాపై మంగళవారం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజారమేష్ ప్రేమ్‌కుమార్ సమీక్ష నిర్వహించారు. ఆయన నియోజకవర్గంలోని 8 మండలాలకు చెందిన వివిధ పార్టీల రాజకీయ నాయకులు, తహసీల్దార్లు, బీఎల్వోలతో సమీక్షించి చేర్పులు, మార్పులు, తొలగింపులపై చర్చించారు. ఓటర్ల జాబితాను పక్కాగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. బీఎల్వోలు 18 ఏళ్లు నిండిన వారిని గుర్తించి వారికి ఫారం–6 ద్వారా ఓటుహక్కు కల్పించాలన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆత్మకూరురూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ అన్నారు. మండలంలోని వాశిలి ఎస్సీ కాలనీలో మంగళవారం స్థానిక సర్పంచ్ చెలికా రమ అధ్యక్షతన నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవం సభలో ఆయన ప్రభుత్వం అమలు చేస్తున్న పలు పథకాలను వివరించారు డీటీ రాజేష్, ఉపాధి హామీ ఏపీఓ శిరీషా, ఆర్‌ఐ పృథ్వీకుమార్, వసతి గృహ సంక్షేమాధికారి పద్మనాభరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓ ఆకస్మిక తనిఖీ

చేజర్ల: మండలంలో జరుగుతున్న భూముల రీసర్వేకి సంబంధించి రికార్డులను ఆత్మకూరు ఆర్డీఓ మధులత మంగళవారం తనిఖీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో రీసర్వే రికార్డులను పరిశీలించి, రీసర్వే వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఐదు గ్రామాల్లో రీ సర్వే జరుగుతోందని తెలియజేశారు. రీ సర్వేపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఓటర్ల ముసాయిదా జాబితా లిస్ట్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పి.కృష్ణ రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

ఉదయగిరి: మండలంలోని వెంగళరావునగర్ సచివాలయ పరిధి గండిపాళెంలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గానుగపెంట ఓబుల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పాల్గొంటారన్నారు. మండల అధికారులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలన్నారు.

కెనరాబ్యాంకు ఏటీఎం ఏర్పాటు

సంగం: సంగంలో మంగళవారం కెనరా బ్యాంకు ఏటీఎం సేవలు ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంకు మేనేజర్ అశోక్ కుమార్ మాట్లాడుతూ ప్రజలు ఏటీఎం సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏటీఎం సేవలతో పాటు నగద్ విత్‌డ్రా, డిపాజిట్ సేవలు కూడా అందుబాటులో ఉంటాయని తెలిపారు.

అగ్నిప్రమాద బాధితులకు రెడ్‌క్రాస్ చేయూత

జలదంకి: మండలంలోని తిమ్మసముద్రం గిరిజన కాలనీలో ఇటీవల అగ్ని ప్రమాదానికి గురై సర్వం కోల్పోయిన తలపల దుర్గాప్రసాద్, స్వాతి కుటుంబానికి జలదంకి రెడ్‌క్రాస్ చైర్మన్ వడ్డే శ్రీనాథ్‌రెడ్డి మంగళవారం తక్షణ సాయంగా వంట పాత్రలు, టార్పాలిన్ పట్టలు, గ్యాస్ స్టౌవ్, నిత్యావసర వస్తువులను అందించారు. కాగా అగ్నిప్రమాదం జరిగిన వెంటనే రూ. 5 వేలు ఆర్థిక సాయం కూడా అందించామన్నారు. ఈ కార్యక్రమంలో మండల రెడ్‌క్రాస్ కోశాధికారి పువ్వాడి సురేష్, తిమ్మసముద్రం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు చలమయ్య తదితరులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

జలదంకి: మండలంలోని జమ్మలపాళెం చెరువులో మంగళవారం పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నట్లు జలదంకి ఎస్సై ఆదిలక్ష్మి తెలిపారు. కొంతకాలంగా పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో తమ సిబ్బందితో దాడులు నిర్వహించి పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి రూ.1,250 నగదును స్వాధీనం చేసుకున్నారు. వీరిని బుధవారం కోర్టులో హాజరు పరుచనున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రీడాదుస్తుల పంపిణీ


విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న దృశ్యం

అనుమసముద్రంపేట: మండలంలోని కావలియడవల్లి జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న పీఈటీ పాఠశాల విద్యార్థులకు ఆయన సొంత నిధులతో క్రీడాదుస్తులను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లోనూ రాణించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఓ వెంకటేశ్వరరావు, పోతులూరయ్య, స్థానిక నాయకులు మాల్యాద్రినాయుడు, నారే శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కారు, బైక్ ఢీకొని ఒకరికి గాయాలు

జలదంకి: మండలంలోని ఎల్ఆర్ అగ్రహారం రోడ్డు అనంతరం అపార్ట్‌మెంట్ సమీపంలో కారు, బైక్ ఢీకొనడంతో ఒకరు గాయపడ్డారు. ఈ ఘటన మంగళవారం జరిగింది. కావలి నుంచి కారు కలిగిరి వైపు వెళ్తుండగా, జలదంకి వైపు నుంచి చిరంజీవి కావలి వైపు బైక్‌పై వెళ్తున్నాడు. అపార్ట్‌మెంట్ వద్దకు వచ్చే సరికి కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొనడంతో చిరంజీవికి తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని చికిత్స నిమిత్తం నెల్లూరులోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. జలదంకి ఎస్సై ఆదిలక్ష్మి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రూ.50 కోట్లతో హైవేపై ఆస్పత్రి నిర్మాణం


కావలి: గౌరవరం టోల్‌ప్లాజా వద్ద ఆస్పత్రి నిర్మాణానికి అవసరమైన స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- గౌరవరం టోల్‌గేట్ సమీపంలో ఏర్పాటు
- త్వరలోనే పనులు ప్రారంభించేందుకు సన్నాహాలు
- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: కావలి మండలం గౌరవరం టోల్‌ప్లాజా సమీపంలో రూ.50 కోట్ల వ్యయంతో ఐదెకరాల్లో అత్యాధునిక ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆర్డీఓ శీనానాయక్‌తో కలిసి ఆస్పత్రి నిర్మాణానికి కేటాయించిన స్థలాన్ని, అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి అవసరమైన స్థలాలను ఎమ్మెల్యే మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కావలి ఏరియా ఆస్పత్రి సామర్థ్యం సరిపోకపోవడంతో, పార్కింగ్‌కు, అంబులెన్స్‌లకు, రోగుల రాకపోకలకు కొంత ఇరుకుగా ఉండడంతో హైవే పక్కనే టోల్‌ప్లాజా సమీపంలో ఆస్పత్రి నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఏరియా ఆస్పత్రి పరిస్థితిని, నూతన ఆస్పత్రి నిర్మాణ ఆవశ్యకతను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా ముఖ్యమంత్రి వెంటనే సానుకూలంగా స్పందించి నిధులు మంజూరుకు అంగీకరించినట్లు తెలిపారు. కలెక్టర్ హరినారాయణన్, కావలి ఆర్డీఓ శీనానాయక్ యుద్ధ ప్రాతిపదికన స్థలాన్ని గుర్తించి ఆస్పత్రి నిర్మాణానికి కేటాయించినట్లు తెలిపారు. త్వరలోనే ఇతర అనుమతులు, టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించనున్నట్లు వివరించారు. ఎమ్మెల్యే వెంట తహసీల్దార్ కే మాధవరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు కేతిరెడ్డి శివకుమార్‌రెడ్డి, చెన్ను ప్రసాద్‌రెడ్డి, కందుల శ్రీనివాసులు, నీలం సాయికుమార్ తదితరులు ఉన్నారు.

రీసర్వేతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం

- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి


దగదర్తిలో భూసర్వేకు సంబంధించిన మ్యాప్‌లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్‌రెడ్డి

దగదర్తి (కావలి): రైతులు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రీసర్వే ప్రక్రియకు శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి అన్నారు. దగదర్తిలో రీసర్వే ప్రక్రియపై మంగళవారం నిర్వహించిన గ్రామసభలో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పత్రాలు సరిగా లేక, రెవెన్యూ రికార్డుల్లో తప్పులు నమోదై, ఇతర కారణాలతో ఇబ్బంది పడుతున్న రైతుల సమస్యలు పరిష్కరించి, పక్కాగా భూహక్కు కల్పించే లక్ష్యంతో రీసర్వే ప్రక్రియ చేపట్టినట్లు వివరించారు. రెవెన్యూ, సర్వే అధికారులు ఆధునిక సాంకేతికత సాయంతో, రైతుల సమక్షంలోనే సర్వే నిర్వహించి సమస్యలు పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఆర్డీఓ వీకే శీనానాయక్ మాట్లాడుతూ రీసర్వే ప్రక్రియకు సంబంధించిన కీలక అంశాలను వివరించారు. రైతుల వద్ద ఉన్న పత్రాలు, రెవెన్యూ రికార్డుల్లోని వివరాలు, క్షేత్రస్థాయిలోని భూ వివరాలను సర్వే చేసి రికార్డులు ఆధునికీకరించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ తాళ్లూ ప్రసాద్‌నాయుడు పాల్గొన్నారు.

ఘనంగా పటేల్ జయంతి


సర్దార్ వల్లభాయ్‌పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


పటేల్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు


కరటంపాడు జీసీ ఎంపీపీఎస్ పాఠశాలలో పటేల్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సంగం: సంగం తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు నాగరాజు ఆధ్వర్యంలో ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు అశోక్ కుమార్, ఆర్ఐ రాజ నారాయణ, వీఆర్‌ఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

వరికుంటపాడు: వరికుంటపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. హెచ్ఎం వీరభద్రయ్య మాట్లాడుతూ దేశాన్ని సమైక్యం చేయడంలో పటేల్ కీలకపాత్ర పోషించారన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వేణుగోపాల్‌రెడ్డి, జయశ్రీ, శ్యామల, ఉప్పు కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరురూరల్: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలికోన్నత పాఠశాల, కరటంపాడు జీసీ, ఎస్సీ, ఆరవేడు, బోయలచిరివెళ్ల, బసవరాజుపాళెం, మహిమలూరు పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు పటేల్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు పటేల్ పోరాట పటిమను, దార్శనికతను విద్యార్థులకు వివరించారు.

అందరికీ జగనన్న ఆరోగ్య సురక్ష


అనుమసముద్రంపేట: గుంపర్లపాడు జగనన్న ఆరోగ్య సురక్షలో ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలిస్తున్న ఆర్డీఓ మధులత, నాయకులు


మర్రిపాడు: బొర్రా సుబ్బిరెడ్డి, సర్పంచ్ మాగంటి శ్రీనివాసులరెడ్డి, ఎంపీడీఓ పరిమి నాగమణి, డాక్టర్ గోపినాథ్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. ముందుగా నిర్దేశించిన సచివాలయాల పరిధిలో స్థానికులకు సమాచారం ఇవ్వడంతో ప్రజలు శిబిరాలకు చేరుకుని వైద్య పరీక్షలు పొందుతున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు.


ఉదయగిరి: ఉదయగిరి బిట్-3 సచివాలయంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

సబ్సిడీపై పచ్చిశనగ విత్తనాలు

చేజర్ల: రైతులకు సబ్సిడీపై పచ్చిశనగ విత్తనాలు ఇస్తున్నామని ఏఓ శశిధర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పచ్చిశనగ విత్తనాలు కావాల్సిన రైతులు ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు. ఆధార్ కార్డు జిరాక్స్ తీసుకొని వీఏఏలను సంప్రదిస్తే రిజిస్ట్రేషన్ చేస్తారని తెలి పారు. జేజీ 11 రకం విత్తనాలు కేజీ రూ.81 కాగా రూ.32.40 సబ్సిడీ పోను రూ.48.60, కేఏకే-2 రకం కేజీ రూ.140.50 ధర కాగా, రూ. 56.20 ధర పోను రూ.84.30లకు అందజేస్తున్నట్లు వివరించారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

బ్యాంకు పథకాలపై అవగాహన

ఉదయగిరి: మండలంలోని కుర్రపల్లి బీసీ కాలనీలో ఉదయగిరి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఆధ్వర్యంలో మంగళవారం ఆర్థిక అక్షరాస్యత, బ్యాంకు పథకాలపై కళాబృందం అవగాహన కల్పించింది. బ్యాంకు అధికారులు మాట్లాడుతూ బ్యాంకు పథకాలపై ఖాతాదారులు అవగాహన కలిగి సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమ బ్యాంకు విరివిగా వ్యాపార, గృహ నిర్మాణ, విద్య సంబంధించి రుణాలు తక్కువ వడ్డీకే అందిస్తోందన్నారు. అసిస్టెంట్ మేనేజరు పెదబాబు, ఫీల్డ్ ఆఫీసరు శ్రీనివాస్, బ్యాంకుమిత్రలు నాయబ్, వెంకటేష్, కో–ఆర్డినేటర్ అన్వర్‌బాషా పాల్గొన్నారు.